

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## రెండో ప్రేమ

**"నేను రియాని** ప్రేమిస్తున్నాను" సంజయ్ ఉపోద్ఘాతంగా చెప్పాడు.

"ఇంట్లో లక్షణమైన పెళ్ళాన్ని ఉంచుకుని అదేం రోగం?" నివ్వెరపోయిన గోపాల్ అప్రయత్నంగా అడిగాడు.

"ఆమె లేకుండా బతకలేనురా"

ఆ మాటల్లోని నిజాయితీని గమనించిన గోపాల్ అనుమానంగా అడిగాడు.

"నువ్వు నిజంగానే అంటున్నావా?"

"అవున్రా నేను చేసేది సమాజానికి తప్పని తెలుసు. కానీ నాకు తప్పుగా అనిపించడంలేదు. ఏం చేయాలో తోచడంలేదురా" సంజయ్ నిస్సహాయంగా చెప్పాడు.

"నాకు గుర్తుంటే, నువ్వు వసుధని కూడా ప్రేమించే పెళ్ళిచేసుకున్నావు. అవునా?"

సంజయ్ మొహం అప్రసన్నంగా మారింది.

"అవును."

"మరి? మీ పెళ్ళయి పదేళ్ళు కాలేదూ?"

"పన్నెండేళ్ళు."

"అబ్బా! అప్పుడు నువ్వు నాతో చెప్పిన మాటలు ఇంకా గుర్తున్నాయి. ఆరోజు కూడా నువ్వు ఇవే మాటలు కాస్త అటూ ఇటుగా చెప్పావు. 'వసుధని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాను. ఆమె లేకుండా బతకలేను.."

"చాలు ఆపు. అప్పుడేదో ఇరవైమూడేళ్ళ పసితనంలో చేసినపని అది." సంజయ్ విసుక్కున్నాడు.

"ఇరవై మూడేళ్ళు పసితనమా?" గోపాల్ ఆశ్చర్యపోయాడు.

"అవును. ప్రేమించడానికి అది పసితనమే కదా?" సంజయ్ సమర్ధించుకున్నాడు.

"అంటే అది ప్రేమ కాదా?"

"ప్రేమే. కాదని ఎవరన్నారు?"

"మరి?"

"నూరేళ్ళ జీవితంలో ఒకే ఒక్కర్ని ప్రేమించాలంటే ఎలా? ఒక్కో వయసులో ఒక్కో పరిణితి ఉంటుంది. దానికి తగ్గట్లు అభిరుచులు మారుతూంటాయి. నిజం చెప్పు. చిన్నప్పుడు మనకి నచ్చిన సినిమాలని ఇప్పుడు పదినిమిషాలైనా చూడగలమా? ఇదీ అలాంటిదే. ఎందుకు అర్ధం చేసుకోవురా?" సంజయ్ చిరుకోపంగా అడిగాడు.

గోపాల్ మిత్రుడి చెయ్యి పట్టుకుని ఓదార్పుగా నిమిరాడు.

"అంత భావుకత్వం ప్రమాదంరా సంజూ. రాజీపడిపోయి బతకాల్సిందే. ప్రేమించి పెళ్ళి చేసుకున్న నువ్వే ఇలా మాట్లాడితే అరేంజ్డ్ మారేజ్ చేసుకున్న మేము ఏమనాలి"

"నేనలా రాజీ పడలేనురా."

"సరే వసుధ ఇప్పుడు నీకు ఎందుకు నచ్చడంలేదు.?"

సంజయ్ విసుగ్గా చూసాడు. తలెత్తి ఆకాశంలోకి చూసాడు. పౌర్ణమి దగ్గర్లో ఉన్నట్లుంది. వెన్నెల తెల్లగా చల్లగా ఉంది.

"వసుధ వాళ్ళు మా పక్కింట్లోనే ఉండేవాళ్ళు. ముగ్ధంగా అమాయకంగా ఉండే వసుధ నాకు భలే నచ్చేసింది. ఎంత అమాయకం అంటే నల్లనివన్నీ నీళ్ళు, తెల్లనివన్నీ పాలు అనుకునే రకం. తను లేందే బతకలేను అనిపించింది. నీకూ అదే చెప్పానుకదా? పెళ్ళికి మావాళ్ళెవరూ నో చెప్పలేదు. ఆ రోజు నాకు చంద్రమండలంకి వెళ్ళినట్లు, మూన్‌వాక్ చేసినట్లు అనిపించింది. వసుధ భర్తగా లోకాన్ని జయించాననుకున్నాను" సంజయ్ ఆవేదనగా చెప్పాడు.

"ఇప్పుడేమైంది? అంతా బానేవుందిగా?" గోపాల్ ఆశ్చర్యంగా అడిగాడు.

"విసుగ్గా ఉందిరా, నావల్ల కావడంలేదు. పద్దెనిమిదేళ్ళ వయసులో అమాయకత్వం ముద్దుగా ఉంటుంది. ముప్పై ఏళ్ళ వయసులో అసహ్యంగా ఉంటుంది. ఆ గారాలు, ముద్దుమాటలు భరించలేకపోతున్నారా. ప్రతీదీ ఆశ్చర్యమే, అన్నీ విడ్డూరమే. ఇడ్లీ పచ్చడి చేసి ఆవకాయ పెట్టినంత బిల్డప్. ప్రతీ విషయంలో సుకుమారమే. నాకు నచ్చడంలేదు. బొత్తిగా

లోకజ్ఞానం లేదు. వార్తలు విందామనో, న్యూస్ పేపర్ చదువుదామనో అనుకోదు. పేపర్ చదవకపోతే విడాకులిస్తావా అనొద్దు. మనిషికి ఇంటలెక్చువల్ ఇంటర్‌కోర్స్ కూడా చాలా ముఖ్యం. కనీసం నాకు."

"నీ బాధ అర్థమైందిరా, కానీ ఎలా? ఈ రియా ఎవరు?"

సంజయ్ మొహం వికసించింది.

"రియా మా కాలేజ్‌లోనే పనిచేస్తుంది. తనతో మాట్లాడ్తూంటే ఎంత బావుంటుందో తెలుసా? మేము ప్రేమ మాటలు, భావుకత్వాలు మాట్లాడుకోం. మామూలు విషయాలే. కానీ వాటిమీద తనకి ఉన్న అథారిటీకి ఎంత ముచ్చటేస్తుందో. జీవితం అంటే వండుకోవడం, తినడం, చీరలు కొనుక్కోవడం, ప్రతీదానికీ 'అవునా?' అని కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యం ప్రకటించడం ఇదేనా గోపీ? కొన్నిరోజులకి అవన్నీ కృతకంగా అనిపించవు? కాలంతోపాటు మనుషులు ఎదగొద్దూ? అప్పటికీ పెళ్ళవగానే తనకి చెప్పాను. డిగ్రీలో చేరు. మినిమం డిగ్రీ ఉంటే బావుంటుందని. 'నా వల్లకాదండీ' అని గారాలు పోయింది. నేను క్లాసిక్స్ అనుకున్న తెలుగు నవలలు తెచ్చిచ్చి కనీసం పదిరోజులకొక పుస్తకం చదవమని చెప్పాను. ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. 'పుస్తకం పట్టుకుంటే నిద్రొస్తుందండీ' అని చెప్పేది.

తన మాటల్లో, నాతో చెప్పే కబుర్లలో అస్సలు ఇంటిలిజెన్స్ ఉండదు. ఎంతకాలం ఆ బుద్దిలేని మాటలు వినాలి చెప్పు? జీవితం మీదే విరక్తి పుడుతోంది గోపీ. వెన్నెల చల్లగా తెల్లగా బావుంది కదూ? అంటే, 'అయ్యో ఆరేసిన బట్టలు తీయడం మర్చిపోయాను. చల్లబడిపోయి వాసనొస్తాయి' అని పరిగెత్తుతుంది. వానైనా ఎండైనా తనకి ఆరేసిన బట్టలే గుర్తొస్తాయి. లేదా నానపెట్టిన పప్పు రుబ్బాలని గుర్తొస్తుంది. ఇద్దరు పిల్లలు పుట్టగానే తనలో రొమాంటిక్ ఛానల్ మూసుకుపోయింది. ఎంతసేపూ తెలుగు సీరియల్స్, లేదా తెలుగులో డబ్ చేసిన కొరియా సీరియల్స్ చూడడమే. ఇప్పుడు నిద్రరాదు. ఈ అజ్ఞానాన్ని భరించలేకపోతున్నారా. రియా పరిచయం వల్ల ఇది ఇంకా భూతద్దంలో కనిపిస్తోంది" సంజయ్ కణతలని ఒత్తుకున్నాడు.

"కొంపతీసి వసుధతో ఇవేం చెప్పలేదుగా? అదే రియా గురించి." గోపాల్ అనుమానంగా అడిగాడు.

"లేదు. నీతోనే చెప్తున్నాను. ఏమంటావురా?" సంజయ్ ఆశగా అడిగాడు.

"మనదేశం నీ అంత ఎదగలేదురా. సాధ్యమవకపోవచ్చు. ఈ కారణంగా ఎవరూ విడాకులు ఇవ్వరు. ఇచ్చినా విడాకులు తీసుకున్నవాడిని రియాకూడా పెళ్ళి చేసుకోకపోవచ్చు. సంసారం ఏదో గుట్టుగా సాగిపోతోందిగా. అలాగే కానీ. నామాట విని వసుధతో సంసారం, రియాతో స్నేహం కొనసాగిస్తే బెటర్. వసుధని అడిగితే నీలోని వంద లోపాలు చెప్తుంది. ఎవరూ హండ్రెడ్ పర్సంట్ పర్‌ఫెక్ట్‌గా ఉండరు. ఈ జీవితానికి ఇదే ప్రాప్తం అనుకో" గోపాల్ ఓదార్పుగా చెప్పాడు.

"అంతేనంటావా?" సంజయ్ నిరాశగా అడిగాడు.

"మరి అంతేగా? దయచేసి ఈ మాటలు ఇంకెవరికీ చెప్పకు. మనలాంటి అసంతృప్త భర్తలు, భార్యలు ఎంతోమంది శ్లేష్మంలో ఈగల్లా బతకడం లేదూ, నువ్వు మొదటివాడివి కాదు. చివరివాడివీ కాదు." గోపాల్ అనునయంగా చెప్పాడు.

"మనలాంటా?" సంజయ్ ప్రశ్నార్థకంగా చూసాడు.

గోపాల్ దిగులుగా నవ్వాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments